తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY
సంపుటి : 22 సంచిక : 278 | ఆదివారం సెప్టెంబర్ 15 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

జగన్ ఐదేళ్ల పాలనే ఏపీకి అతిపెద్ద విపత్తు

7 లో..

ఇదండీ..కబురు..





## ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు.. రద్దీగా మెట్రో స్టేషన్

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 14

ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది.

మిగతాది 2లో

# ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్న బిఆర్ఎస్

- కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి పొన్నం
- రాజకీయాలకు అతీతంగా నిమజ్జనం
- అందరూ శాంతియుతంగా పాల్గొనాలని వినతి





కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 14

ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టింది భారాస కాదా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ వాసులను కాంగ్రెస్ ఏనాడూ విమర్శించలేదన్నారు. ఆంధ్రా ప్రజలను గతంలో కేసీఆర్ దారుణంగా విమర్శించారని ఆరోపించారు. భారాస పని అయిపోయిందని సొంత పార్టీ నేత అరెకపూడి గాంధీ అంటున్నారని చెప్పారు. ప్రాంతీయతను రాజకీయంగా వాడుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి ఇద్దరూ చేసింది తప్పే. భౌతిక దాడులు మంచివి కాదు.

మిగతాది 2లో

## అప్పుల్లో కూరుకుపోయిన పౌరసరఫరాల శాఖ

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 14

- పౌరసరఫరాల శాఖలో ధాన్యం కొనుగోలులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.



2 లో

## హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ త్వరలోనే ఆర్డినెన్స్: రంగనాథ్

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 14

- జీవో 99 ద్వారా జులై 19న హైడ్రా ఏర్పాటు చేశారని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.



2 లో

# ముగింపు దశకు వినాయక చవితి ఉత్సవాలు

## గంగ ఒడికి సిద్ధం అవుతున్న గణపయ్య

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 14

వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నిమజ్జ నంతో ఈ యేడు ఉత్సవాలు ముగుస్తాయి. తొమ్మది రోజుల పాటు పూజలను అందుకున్న గణపయ్య పదో రోజైన అనంత చతుర్దశి రోజున నిమజ్జనంతో గంగమ్మ ఒడిలోకి చేరతాడు. అనంత చతుర్దశి రోజున ప్రజలు గణపతి విగ్రహాన్ని ఎంతో వైభవంగా, సంగీత వాయిద్యాలతో ఊరేగిస్తూ నది దగ్గరకు తీసుకుని వెళ్లి నిమజ్జనం చేస్తారు.



02

# దేశవ్యాప్తంగా భారీ వర్షాలు



2 లో

- విస్తరిస్తున్న నైరుతి పవనాలు
- ఉత్తరాదిలో పలుచోట్ల భారీ వర్షాలు

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 14

దేశంలో నైరుతి రుతుపవనాలు పర్వతాల నుంచి మైదానాల వరకు విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలోనే అనేక చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నేడు, రేపు కూడా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని గంగా తీరాలలో సెప్టెంబర్ 15 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఇది కాకుండా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, సిక్కిం, మహారాష్ట్ర, గుజరాత్ అన్ని ఈశాన్య రాష్ట్రాలలో రాబోయే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది.

# అరికెపూడి గాంధీపై హత్యాయత్నం కేసు

- కౌశిక్ రెడ్డి ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు



02

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 14

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి వ్యవహారంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై హత్యాయత్నం కేసు నమోదైంది. కౌశిక్‌రెడ్డి ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. గాంధీ సోదరుడు, కుమారుడు పృథ్వీతోపాటు కార్పొరేటర్లు వెంకటేశ్ గౌడ్, శ్రీకాంత్‌లను నిందితులుగా చేర్చారు. ఈ నెల 12న కౌశిక్‌రెడ్డి నివాసంపై అరికెపూడి గాంధీ అనుచరులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్టు అంటూ ఇంటికే పరిమితం చేసిన పోలీసులు.. కూకట్‌పల్లి నుంచి కొండాపూర్ దాక 9 కిలోమీటర్లు మందీమార్బలంతో అరికెపూడి బయల్దేరినా పోలీసులు చూడనట్టే ఉండిపోయారు. భారీ కాన్వాయ్‌తో కౌశిక్ ఇంటికి చేరిన గాంధీ.. తన అరుచరులతో కలిసి ఆయన నివాసంపై దాడికి పాల్పడ్డారు. టమాటాలు, గుడ్లు, రాళ్లతో విధ్వంసం సృష్టించారు.

# అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్ పాలన

- పాడిని హౌజ్ అరెస్ట్ చేయించి దాడి చేశారు
- దాడి సమయంలో ఉన్న పోలీసులను సస్పెండ్ చేయాలి
- వందరోజుల్లో గ్యారెంటీలు అని తోక ముడిచారు
- అన్నివర్గాలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి
- కాళ్లు పట్టుకుని ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ డిమాండ్



2లో..

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 14

రాష్ట్రంలో అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్ పాలన నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెచ్చిపోయి విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అమెరికా నుంచి హైదరాబాద్ తిరిగొచ్చిన కేటీఆర్.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసి, పోలీసులే దాడి చేయించారని ఆరోపించారు. పాడి కౌశిక్ రెడ్డిని పరామర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తొమ్మిదిన్నర నెలలుగా అసమర్థుడి జీవనయాత్రలా రేవంత్ ప్రభుత్వం కొనసాగుతుందని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి, రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పి అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి మోసం చేశారని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఎమ్మెల్యేల ఇంటికి చేరి, కాళ్లు పట్టుకొని మరీ కండువాలు కప్పుతాడని కేటీఆర్ విమర్శించారు. పదిమంది ఎమ్మెల్యేలు పోయారు, ఇంకా వస్తారు అని కాంగ్రెస్ మంత్రులు నుంచి ఎమ్మెల్యేల వరకు మాట్లాడుతున్నారని అన్నారు. హైకోర్టు తీర్పు తర్వాత కాంగ్రెస్‌లో భయం మొదలైందని తెలిపారు. ఫిరాయింపులపై స్పీకర్‌ను కలిసి సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉటంకిస్తూ పిర్యాదు చేశామని చెప్పారు. దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి మీద డిస్ క్వాలిఫై పిటిషన్ వేసింది కౌశిక్ రెడ్డి అని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున హైకోర్టు జస్టిస్‌కు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపండి, చావు డప్పులు కొట్టండి అని నాడు రేవంత్ రెడ్డి మాట్లాడారని కేటీఆర్ అన్నారు.

## 20న తెలంగాణ కేబినెట్ భేటీ

హైదరాబాద్,సెప్టెంబర్14



తెలంగాణ మంత్రివర్గం సమావేశం ఈ నెల 20న జరుగనుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రిమండలి భేటీ అవుతుంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో వరదలు, కేంద్ర ప్రభుత్వ సాయంపై చర్చించనున్నారు. అదేవిధంగా హైడ్రా పని విధానం, హైడ్రా చట్టబద్ధతకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశంపై చర్చిస్తారు. బీసీ రిజర్వేషన్, కులగణన, 200 పంచాయతీయల ఏర్పాటుపై ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశం చర్చకు రానుంది. దీంతోపాటు రుణమాఫీ, రైతుభరోసాపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

# దేశవ్యాప్తంగా భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి

ంరోవైపు మిజోరాం, త్రిపుర, అసోం, మేఘాలయ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ ప్రాంతాల్లో సెప్టెంబరు 14, 15 తేదీల్లో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని కత్రాలోని త్రికూట పర్వతంపై రోజంతా పొగమంచు కారణంగా మా వైష్ణో దేవి వద్దకు హెలికాప్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయినప్పటికీ, బ్యాటరీ కార్, రోప్‌వే సేవలు కొనసాగించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి సుమారు 18 వేల మంది భక్తులు అమ్మవారిని కొలుస్తూ భవనం వైపు బయలుదేరారు. జ్యోతిర్మఠం-మలారి రహదారిని మూసివేయడంతో 47 మంది వ్యక్తులు మార్గమధ్యంలో చిక్కుకుపోయారు. పార్థదీప్‌లో కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ హైవే శుక్రవారం రోజంతా మూసివేయబడింది. సిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో శనివారం వరదలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సిమ్లా హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే పశ్చిమ హిమాలయ రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారులతో సహా 400కి పైగా రహదారులపై ట్రాఫిక్ నిలిచిపోయింది. బద్రీనాథ్ హైవే కూడా రోజంతా మూసివేయబడింది. కేదార్‌నాథ్ ఫుట్‌పాత్ రెండో రోజు కూడా తెరవలేదు. హిమాచల్‌లోని రెండు జిల్లాల్లో ఆకస్మిక వరదల ప్రమాదం పెరిగింది. అదే సమయంలో మైదాన రాష్ట్రాల్లో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు జలమయమై జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. ఉత్తరాఖండ్‌లోని కుమావోన్ ప్రాంతంలో వర్షాల కారణంగా పలు ఘటనల్లో ముగ్గురు మహిళలు సహా ఐదుగురు మరణించారు. ఈ మరణాలు లోహాఘాట్, పితోరాఘర్, అల్మోరా, హల్ద్వానీ, సితార్‌గంజ్‌లలో సంభవించాయి. రాష్ట్రంలోని 324 రహదారులు కూడా పర్వతాల నుంచి రాళ్లు, శిథిలాల కారణంగా వివిధ ప్రాంతాల్లో మూసుకుపోయాయి. వీటిలో 185 రోడ్లు కుమావోన్ ప్రాంతంలో ఉన్నాయి. పలు జిల్లాల్లో పాఠశాలలు మూతపడ్డాయి. కార్బెట్ పార్క్‌లో సఫారీ కూడా నిలిపివేశారు.

## సంపాదకీయం



# ఇలా చేయటం సబబేనా!

ఆ ఉద్యమాన్ని తుంచేయడానికి, సాక్ష్యాధారాలు మాయం చేయడానికి గూండాలను ఉసిగొల్పి విధ్వంసం సృష్టించిన తీరు వారిని మరింత రెచ్చగొట్టింది. ఉన్నతాదర్శాలతో ఈరంగంలో అడుగుపెట్టిన యువ వైద్యులను పాలనా నిర్వాహకులు వేధించుకు తినటం, మాఫియా లుగా మారటం, పాలకులు పట్టనట్టు వ్యవహరించటం వాస్తవం. తూట్లు పూడుస్తున్నట్టు కనబడు తూనే తూములు తెరిచిన చందంగా పాలకులు వ్యవహరించిన తీరు దాచేస్తే దాగని సత్యం. జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలు ఎటువంటివో, అవి ఎంత ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయో ఇవాళ దేశమంతా తెలిసింది. కొంత హెచ్చుతగ్గులతో ఇంచుమించు ప్రతి రాష్ట్రంలోనూ ఇలాంటి దయనీయ స్థితిలోనే జూనియర్ డాక్టర్లు తమ వృత్తిని కొనసాగించాల్సి వస్తున్నదని కూడా అందరూ గ్రహించారు. ప్రజావైద్యరంగంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన అవ్యవస్థ దళారీలనూ పెత్తందార్లనూ సృష్టించిందని, ఆ రంగాన్ని రోగగ్రస్తం చేసిందని జనంగుర్తించారు. దేన్నయినా రాజకీయ కోణంలోనే చూడటం అలవాటైన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దీన్నుంచి కూడా అవలీలగా బయటపడగలమని తొలుత భావించారు. పైపై చర్యలతో ఉద్యమాన్ని సద్దుమణగనీయొచ్చని ఆశించారు. పరిస్థితి చేయి దాటుతున్నదనిఆలస్యంగా గ్రహించారు. గురువారం ఉద్యమకారులతో చర్చించడానికి రాష్ట్ర సెక్రటేరియట్‌లోరెండు గంటలకు పైగా వేచిచూసి, వారు వచ్చే అవకాశం లేదని గ్రహించాక రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ప్రజలకోసం రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని కూడా ప్రకటించారు. మొదట్లో సమస్య పరిష్కారానికి సిద్ధపడని ఆమె వైఖరివల్లనే సమస్య జటిలంగా మారిందన్నది వాస్తవం. వైద్య సాయం అందక, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకోలేకపలువురు మరణించారు. ఈ పాపం నుంచి ఆమె తప్పించుకోలేరు. తన స్వభావానికి భిన్నంగా ఉద్యమం విరమించుకోవాలని ముకుళిత హస్తాలతో ఉద్యమకారులను వేడుకోవటం, వారితో చర్చించటానికి సుదీర్ఘ సమయం వేచిచూడటం ఇది గ్రహించబట్టే. చేతులు కాలాక ఆకులు పట్టు కోవటం లాంటిదే ఇది. అయితే ఉద్యమకారులుగా పట్టువిడుపులు ప్రదర్శించాలని జూనియర్ డాక్టర్లు కూడా గుర్తించాలి. ఉద్యమం విరమించి విధులకు హాజరు కావాలని ఇప్పటికి మూడుసార్లు సర్వోన్నత న్యాయస్థానం కోరింది. అలా చేరితే ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు ఉండబోవని మొన్న పదో తేదీన వారికి చెప్పింది కూడా. జరిగిన దుస్సంఘటనపై దర్యాప్తు జరపాలని, పని పరిస్థితులు మెరుగు పర్చాలని, జూనియర్ డాక్టర్లకు భద్రత కల్పించాలని, పని గంటల భారాన్ని తగ్గించాలని మొదట్లో కోరారు. ఇప్పుడు సీబీఐ దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపాల్‌ను, మరికొందరిని తొలగించారు. పలువురిని అరెస్టు చేశారు. జూనియర్ డాక్టర్లు లేవ నెత్తిన మౌలిక సదుపాయాల కల్పనకు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కానీ ఉద్యమకారుల డిమాండ్లు పెరుగుతూ పోతున్నాయి. వైద్యరంగ ప్రక్షాళన కోసం వైద్య విద్యా డైరెక్టర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి, నగర పోలీస్ కమిషనర్ రాజీనామా చేయాలని తాజాగా వారు కోరుతున్నారు. అంతే కాదు... తమతో మమత జరపదల్చుకున్న చర్చలను చానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం చేయాలనిడిమాండ్ చేశారు. అందుకు ఒప్పలేదన్న కారణంతో గురువారం చర్చలను బహిష్కరించారు. సాక్షాత్తూ సుప్రీంకోర్టే తన కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నప్పుడు చర్చలు ప్రజలందరూ చూసేలా జరగటంలో తప్పేముందన్నది వారి ప్రశ్న. వినటానికి సబబే అనిపించవచ్చు. కానీ మమత అంటున్నట్టు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు సాగుతోంది. దానిపై బహిరంగ చర్చ మంచిదేనా? దుండగుల దాడిలో బలైపోయిన యువ వైద్యురాలి కుటుంబసభ్యుల గోప్యత ఏం కావాలి? ఉద్యమకారులు రాష్ట్రపతికి, ఉపరాష్ట్రపతికి, ప్రధానికి లేఖలు రాశారు. కానీ ఇప్పటికే తీసుకున్న చర్యలకు మించి వారేం ఆశిస్తున్నారనుకోవాలి?నిరుపేద వర్గాలకు చెందిన వృద్ధులు, గర్భిణులు, దీర్ఘవ్యాధులతో బాధపడేవారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు లభించక తల్లడిల్లుతున్నారు. దాదాపు 25 మంది రోగులు ప్రాణాలు కోల్పోయారని మీడియా కథనాలు చెబుతున్నాయి. 8,000 మంది జూనియర్ డాక్టర్ల సమ్మె కారణంగా వైద్య సేవలు అందించలేమని సర్కారీ ఆస్పత్రులు చేతులెత్తేయటం వల్ల అంతంతమాత్రంగా బతుకీడుస్తున్నవారు సైతం రోగాలబారిన పడిన తమ ఆప్తుల్ని రక్షించుకోవటానికి అప్పులుచేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అందుకే జూనియర్ డాక్టర్లు తమ బాధ్యత గుర్తెరగాలి. పాలకులపై తమకున్న ఆగ్రహం దారితప్పి సామాన్యులను కాటేస్తున్న వైనాన్ని గమనించాలి. తమ డిమాండ్లకు సమాజం నుంచి సానుకూలత, సానుభూతి వ్యక్తమవుతున్న తరుణంలోనే విధుల్లో చేరాలి. తెగేదాకా లాగటం మంచిది కాదని తెలుసుకోవాలి.

# ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్న బిఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి

శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రతిపక్షం వ్యవహరిస్తోంది. శాంతి భద్రతల అంశంలో కఠినంగా వ్యవహరిస్తాం. పార్టీ ఫిరాయింపులను మేం ఎక్కడా ప్రోత్సహించలేదు. భారాస గతంలో తెదేపా, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను చేర్చుకుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు భారాస మంత్రి పదవులు ఇవ్వలేదా? అని పొన్నం ప్రశ్నించారు. ఐక్యతకు హైదరాబాద్ ప్రతీకగా నిలుస్తోందని, ఎక్కడైనా అలజడులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరించాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే, అపోహలు సృష్టించే వారిని ఉక్కుపాదంతో అణిచి వేయాలని సూచించారు. 17న జరిగే నిమజ్జన వేడుకలు రాజకీయాలకతీతంగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రభుత్వం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఉన్నత అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. జంటనగరాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. నిమజ్జనంలో ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే పోలీస్, రెవెన్యూ శాఖలకు సత్వరమే తెలియజేయాలి. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. ప్రజలు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలి. 16న నిర్వహించే మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లిం మతపెద్దలు 17న జరుపుకునేలా అంగీకరించారని మంత్రి పొన్నం పేర్కొన్నారు. నిమజ్జన వేడుకలు శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తామని, ఇప్పటికే జిల్లాస్థాయిలో అధికారులతో సమావేశాలు నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా పోలీస్ యంత్రాంగాన్ని ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు. ఈ వేడుకల్లో మొత్తం 25 వేల మంది పోలీసులు విధుల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు

# ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు.. రద్దీగా మెట్రో స్టేషన్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ : ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఖైరతాబాద్ గణేశుడి దర్శనానికి ఎల్బీనగర్, మియాపూర్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో మెట్రో స్టేషన్ పరిసరాలు సందడిగా మారాయి. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఖైరతాబాద్ గణేశుడికి భక్తుల తాకిడి పెరిగింది. దీంతో మెట్రో రైలు యాజమాన్యం భక్తులకు ఎలాంటి ఇబ్బందికలగకుండా ఏర్పాట్లు చేస్తోంది. టికెట్ కౌంటర్లు, ఎగ్జిట్ గేట్ల వద్ద రద్దీ పెరగకుండా తగిన చర్యలు చేపట్టింది. క్యూఆర్ కోడ్ టికెట్లకు, కార్డ్ ద్వారా వెళ్లే ప్రయాణికులను వేర్వేరుగా పంపిస్తోంది. స్టేషన్ లోపల ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ముందస్తుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని, కార్డులో సరిపడా డబ్బులు లేకపోతే ఎంట్రీ స్టేషన్‌లో రీఛార్జ్ చేసుకోవాలని ప్రయాణికులకు సూచిస్తున్నారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌లో ఉదయం నుంచి గంట గంటకు రద్దీ పెరుగుతుండటంతో మెట్రో యాజమాన్యం అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. టికెట్ కౌంటర్లు, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లతోపాటు ఫ్లాట్ ఫాం వద్ద భద్రతా సిబ్బంది ప్రయాణికులకు తగిన సూచనలు చేస్తున్నారు.

# అప్పుల్లో కూరుకుపోయిన పౌరసరఫరాల శాఖ

మొదటిపేజీ తరువాయి

ఆదిలాబాద్ : పౌరసరఫరాల శాఖలో ధాన్యం కొనుగోలులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రూ.54 వేల కోట్ల అప్పుల్లో పౌరసరఫరాల శాఖ కూరుకుపోయిందన్నారు. ధాన్యం కొనుగోలులో గత ప్రభుత్వం విధానాలనే.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తుందని అందుకే ఆ శాఖ అప్పుల్లో ఉందని చెప్పారు. ధాన్యం కొనుగోలులో జరిగిన అవకతవకలపై గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని, దీనిపై విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలులో ఐదుగురు వేలందారులు టెండర్లు దక్కించుకున్నారన్నారు. ధాన్యం కొనుగోలులో రూ.2,230 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అన్న అంశంపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. వేలందారులు, మిల్లర్లు, ప్రభుత్వం కుమ్మక్కై భారీగా అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఎమ్మెల్యే ఆరోపించారు.

# హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ త్వరలోనే ఆర్డినెన్స్: రంగనాథ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: జీవో 99 ద్వారా జులై 19న హైడ్రా ఏర్పాటు చేశారని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “హైడ్రా చట్టబద్ధతపై కొందరు ప్రశ్నిస్తున్నారు.. ఇది చట్టబద్ధమైనదే. కార్యనిర్వాహక తీర్మానం ద్వారానే ఏర్పాటు చేశారు. దీనికి చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ నెల లోపు ఆర్డినెన్స్ రానుంది. విశేష అధికారాలు కూడా రాబోతున్నాయి. 6 వారాల తర్వాత అసెంబ్లీలో హైడ్రా బిల్లు వస్తుంది. మున్సిపాలిటీలు, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు సహకారం అందిస్తాం. గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలో హైడ్రా పనిచేస్తుంది” అని రంగనాథ్ తెలిపారు.

# అరికెపూడి గాంధీపై హత్యాయత్నం కేసు

మొదటిపేజీ తరువాయి

ఇంటి అద్దాలు పగులగొట్టారు. పూల కుండీలను ధ్వంసం చేశారు. కాగా, ఇదే వ్యవహారంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహా 15 మంది ఆయన అనుచరులపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద ఇప్పటికే రెండు వేర్వేరు ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేశారు. కౌశిక్‌రెడ్డితోపాటు గచ్చిబౌలి పోలీసులు సైతం ఎమ్మెల్యే గాంధీ, అతడి అనుచరులపై ఫిర్యాదులు చేయడంతో ఈ ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. దాడి, హత్యాయత్నం చేసినట్టు కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, తమ విధులకు ఆటంకం కలిగించినట్టు గచ్చిబౌలి ఎస్‌ఐ మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు వేర్వేరు ఫిర్యాదులపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే గాంధీ సహా 15 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు అతడి అనుచరులు ఉప్పలపాటి శ్రీకాంత్, బీ గౌతమ్‌గౌడ్, రాంపల్లి వెంకటేశ్, జీ రాములు, నరేశ్, మేల శివ, రాధిక, మంజుల, చంద్రికగౌడ్, రంగం నాగేందర్‌యాదవ్, డీ వెంకటేశ్ గౌడ్, అశ్రఫ్, రఘునాథ్‌రెడ్డి, మోహన్‌గౌడ్ తదితరులపై పలు సెక్షన్ల కింద కేసులను నమోదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించారంటూ గచ్చిబౌలి ఎస్‌ఐ మహేశ్‌కుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే గాంధీ సహా 15 మందిపై కేసులు నమోదు చేశారు. దీంతో దాడికి పాల్పడిన గాంధీ, అతడి అనుచరులపై రెండు వేర్వేరు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి.

## అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్ పాలన

మొదటిపేజీ తరువాయి

కానీ హైకోర్టు తీర్పు వచ్చిన రోజు అరికెపూడి గాంధీని ఖంఅ చైర్మన్‌గా నియమిస్తూ ప్రకటన చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ ఎలా నియమిస్తారని అని ప్రశ్నిస్తే, పోలీసుల అండతో ఎమ్మెల్యే ఇంటిపై దాడికి దిగారని మండిపడ్డారు. ఈ రకమైన గుండాగిరి పదేళ్లలో ఎప్పుడూ లేదని తెలిపారు. ఫ్యాక్షన్ సినిమాలు తలపించేలా దాడులు చేశారని అన్నారు. రేపు జరగకూడనిది జరిగితే, ఎవరు బాధ్యత వహిస్తారు అని ప్రశ్నించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో ఇప్పటికైనా చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్యారెంటీలు అమలు చేయాలని అడిగితే ఇలాంటి హైడ్రామాలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. పైశాచిక ఆనందం కోసం ఇదంతా రేవంత్ చేస్తున్నాడని అన్నారు. కానీ ఇవన్నీ తిరిగి రేవంత్‌కు తిరిగి చుట్టుకుంటాయని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని స్పష్టం చేశారు. పాడి కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసి, పోలీసులే దాడి చేయించారని కేటీఆర్ అన్నారు. దాడి జరిగినప్పుడు ఇక్కడ విధుల్లో విఫలమైన పోలీసులను సస్పెండ్ చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేసి, అర్ధరాత్రి వరకు తిప్పితే, తెలంగాణ ప్రజలు మొత్తం తమ వెంట నిలిచారని అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే తెలంగాణ ప్రజల పౌరుషం చాటారని అన్నారు. నిన్న మమ్మల్ని హౌస్ అరెస్ట్ చేసి, గాంధీకి రక్షణ కల్పించారని అన్నారు. అదే గాంధీని హౌస్ అరెస్ట్ చేస్తే ఇలాంటి సంఘటనలు జరిగేవి కావని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పదేళ్లలో శాంతి భద్రతలు అద్భుతంగా నిర్వహించామని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రజలు అందరూ మా వారే అని స్పష్టం చేశారు. ప్రాంతీయతత్వం మీద దాడులు గతంలో లేవు, ఇప్పుడు ఉండవని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి హైదరాబాద్ ప్రజలు అండగా నిలిచారని, రేవంత్ కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఎందుకు చేరావని అరికెపూడి గాంధీని నిలదీశారు. దిక్కుమాలిన పిఎసి పదవి కోసం ఇలాంటి మాటలు మాట్లాడేందుకు సిగ్గు ఉండాలని విమర్శించారు.

## పదవి ఏదైనా పదవికే వన్నె తెచ్చే నేత పోచారం....

### మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేవారం సాయి రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యం.. సాయి రెడ్డి



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**

హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్ లోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడిగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం ఇబ్రహీంపేట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేవారం సాయి రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ పదవి చేపట్టిన పదవికే వన్నె తెస్తారన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం కోసం పాటుపడుతూ రాష్ట్రంలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న నేత మా ఊరి అల్లుడు కావడం మా అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేవారం సాయి రెడ్డి, యువ నాయకులు దేవారం ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాగా రెడ్డి, రాజిరెడ్డి, గజ్జల రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సలహాదారు పోచారం ను సత్కరించిన డిసిసి కార్యదర్శి



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**

రాష్ట్ర వ్యవసాయ సలహాదారువిగా పదవీ బాధ్యతలు చేపట్టిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో డిసిసి కార్యదర్శి కొత్త కాపు కాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలిసిన నాయకునికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ సలహాదారులుగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోయిని శంకర్, లక్ష్మీనారాయణ, కాశీరాం, హైమద్, సాయిలు, ఖాజా, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపేట్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదానం



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**

బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గంగపుత్ర సంఘం సభ్యులు ఐక్యమత్యంతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడంతో పాటు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు బసవబోయి, అంబయ్య, పోచబోయి, గంగాబోయి, మైశబోయి గంగపుత్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డిని సత్కరించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల







**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**

రాష్ట్ర ప్రభుత్వా వ్యవసాయ సలహాదారునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆయన కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ప్రభుత్వానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి సలహాలు ఎంతో ఉపయోగపడతాయని, రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీనియర్ నాయకుడైన పోచారం శ్రీనివాస్ రెడ్డిని వ్యవసాయ సలహాదారునిగా నియమించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ఎంపీ సురేష్ షట్కర్ పోచారం శ్రీనివాసరెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షాట్కార్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఖాలేక్, టిపిసిసి డెలిగేట్ కూనిపూర్ రాజారెడ్డి, మేక వీరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయ సలహాదారునిగా పదవి బాధ్యతలు చేపట్టిన పోచారం శ్రీనివాస్ రెడ్డి









**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**

హైదరాబాద్ నాంపల్లిలోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారునిగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ప్రకాష్ గౌడ్, ఆది శ్రీనివాస్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు కాసుల బాలరాజ్, ఈరవత్రి అనిల్, నగర మేయర్ విజయలక్ష్మి, పోచారం శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం శంభూ రెడ్డి, పోచారం కుటుంబ సభ్యులు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమ బోర్డు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగాలి...

### తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మల్లేష్..

**కబురు న్యూస్, బోధన్ సెప్టెంబర్14..**

కార్మిక సంక్షేమ బోర్డు పథకాల అమలు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొనసాగాలని తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ సంఘం(ఇఫ్టూ) రాష్ట్ర నాయకులు బి.మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం బోధన్ మండలంలోని ఊట్పల్లి గ్రామంలో ఐ.ఎఫ్.టి.యూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డు పథకాల అమలును ఓపెన్ టెండర్ల ద్వారా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే కుట్రలకు తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. భవన, ఇతర నిర్మాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు నష్టం చేసే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూకుంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా లేబర్ కార్డులను పొందిన కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆరు లక్షల రూపాయలు, సహజంగా మృతి చెందితే లక్ష 30 వేల రూపాయలు, ఆడపిల్లల పెండ్లిలకు పెళ్లి కానుక క్రింద 30వేల రూపాయలు, ఆడపిల్లల కాన్పులకు 30వేల రూపాయలు చెల్లిస్తున్నారని, ఈ చెల్లింపులను కార్మికులు నిర్మిస్తున్న ఇండ్లు, భవనాలు, ఇతర నిర్మాణాల నుండి సెస్సు రూపంలో వసూలు చేసి ఇవ్వడం జరుగుతుందని వివరించారు. నేడు ఈ విధానానికి స్వస్తి పలికి ఓపెన్ టెండర్ల ద్వారా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే కుట్రలకు పూనుకుంటుందని, ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవాలని చూస్తుందని, తద్వారా ప్రైవేటు కంపెనీలకు లాభాలను కట్టబెట్టే ప్రయత్నాలను చేస్తుందని ఆరోపించారు. ఈ చర్యల ద్వారా కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలను వెంటనే మానుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యూ.నాయకులు ఇర్షద్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జయరాజు, ఇస్మాయిల్, రాజు, కార్మికులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ...

**కబురు న్యూస్, బోధన్ సెప్టెంబర్14..**

లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. శనివారం పట్టణంలోని రాకాసిపేట్ లో గల లయన్స్ కంటి ఆసుపత్రి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లయన్స్ ఇంటర్నేషనల్ 320D జిల్లా మాజీ గవర్నర్ వేమూరి లక్ష్మి చేతుల మీదుగా 26లయన్స్ క్లబ్ ల ద్వారా ఎంపికైన పేద మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు పోలవరపు బసవేశ్వర రావు, లయన్స్ ప్రతినిధులు కొడాలి కిషోర్, యార్లగడ్డ శ్రీనివాసరావు, కాట్రగడ్డ భారతి, నాగేశ్వరరావు, శ్యాంసుందర్ పహాడే, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్,రెసిడెన్షియల్ స్కూళ్లను తనిఖీ చేసిన కలెక్టర్

## - నిర్వహణ తీరుపై సంతృప్తి వెలిబుచ్చిన జిల్లా పాలనాధికారి..






**కబురు న్యూస్,నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 14 :**

నిజామాబాద్ నగరంలోని వినాయకనగర్ లో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని, మోపాల్ మండలం కంజరలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదులు,కంప్యూటర్ ల్యాబ్, డార్మెటరీ,స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్,ఆఫీస్, స్టాఫ్ రూమ్ లు తదితర వాటిని పరిశీలించారు.స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం,ఇతర సరుకుల నాణ్యతను,విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు.బోధనా సిబ్బంది హాజరును, సీ.సీ కెమెరాల పనితీరును పరిశీలించారు. విద్యార్థులను పలుకరించి వారికి అందిస్తున్న భోజన,వసతి సదుపాయాలు,రోజువారీ దినచర్య గురించి ఆరా తీశారు.జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన భవన సముదాయం,డార్మెటరీని సందర్శించారు. హాస్టల్,రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్వహణ సజావుగా ఉండడం,పరిసరాలు పరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఇంకనూ ఏమైనా మౌలిక సదుపాయాలు అవసరం ఉన్నాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.సరిపడా సిబ్బంది, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, నీటి వసతి వంటి అన్నిసౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.అయితే వినాయకనగర్ సంక్షేమ వసతి గృహానికి చెందిన విద్యార్థినులు అనునిత్యం బోర్గం(పి) పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు రవాణా వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని,బడి వేళల్లో ఉదయం,సాయంత్రం పూట బస్సు సదుపాయం కల్పించాలని హాస్టల్ నిర్వాహకులు కోరగా,కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి నిర్మల,సహాయ సంక్షేమ అధికారి భూమయ్య, మోపాల్ ఎంపీడీఓ రాములు తదితరులు ఉన్నారు.

# ప్రైవేటు పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలి...

## జిల్లా నాయకులు నిఖిల్ గౌడ్



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నిఖిల్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు భద్రత కూడా కరువైందని, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి పాఠశాల యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూలు చేస్తూ, విద్యను వ్యాపారంగా మార్చేస్తున్నారని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని లేనిపక్షంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు.

# పిసిసి అధ్యక్షున్ని సత్కరించిన డెలిగేట్ కూనిపూర్ రాజిరెడ్డి



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**

రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను శనివారం టిపిసిసి డెలిగేట్ కూనిపూర్ రాజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారునిగా నియామకమైన పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ బాబా, కాంగ్రెస్ నాయకులు మేక వీరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల సంక్షేమం కోరే పార్టీ బిఆర్ఎస్ పార్టీ... మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్





## - నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్

**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**

కార్యకర్తల సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు కృషి చేస్తుందని, పార్టీ అధికారంలో లేదని కుంగిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ముందుకు వెళ్లి పార్టీని బలోపేతం చేసే బాధ్యత మనందరిపై ఉందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ అన్నారు. శనివారం మోస్ర మండల కేంద్రంలో పార్టీ కార్యకర్త ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం గోవూర్ గ్రామంలో విద్యుత్ ఘాతానికి గురై రెండు కాళ్లు కోల్పోయిన వ్యక్తికి ఆర్థిక సహాయాన్ని అందజేసి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని వారికి ధీమా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు కాని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవిని కాపాడుకోవడానికి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడం లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. నియోజకవర్గానికి త్వరలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచ్చేసి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, అఫ్రోజ్,గంగారం, ఇసాక్ శంకర్ ప్రశాంత్ రెడ్డి నాగరాజు గౌడ్, విజయకుమార్, మక్బుల్, గొల్ల ప్రశాంత్, సాయ గౌడ్,గౌతమ్, అప్సర్, గంధం విజయ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకులను దర్శించుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ పద్మావతి...





**కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్14..**

బోధన్ పట్టణంలోని రాకాసి పేట్ లో గల వినాయక మండపాలలో ప్రతిష్టించిన వినాయకులను మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు తూము పద్మావతి శరత్ రెడ్డి దర్శించుకున్నారు. శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు పద్మావతి శరత్ రెడ్డి గణనాధులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా వినాయక మండపాల నిర్వాహకులు మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండపాల నిర్వాహకులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# వ్యవసాయ సలహాదారు పోచారంను సత్కరించిన మున్సిపల్ చైర్మన్ జంగం

## - రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి పోచారం... మున్సిపల్ చైర్మన్

**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14**



రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా నియమితులైన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పదవి ఏది చేపట్టిన పదవికి వన్నెతెచ్చిన నాయకుడన్నారు. నియోజకవర్గ ప్రజలే తన కుటుంబముగా భావించి ప్రజల సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం పాటుపడుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డిని వ్యవసాయ సలదారునిగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నార్ల రవీందర్ గుప్తా, నార్ల ఉదయ్,ఎజాస్, కనుకుట్ల రాజు, కిరణ్, జంగం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనం రోజున అల్లర్లు సృష్టిస్తే రౌడీ షీట ర్ తెరుస్తాం.

కబురు న్యూస్ మెట్ పల్లి సి. ఐ. నిరంజన్ రెడ్డి.



14.మెట్ పల్లి సర్కిల్ పరిధిలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే వినాయక నిమజ్జనం సందర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై రౌడీ షీటర్ తెరుస్తా మని శనివారం పత్రిక ప్రకటనలో మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. మెట్పల్లి సర్కిల్ పరిధిలోని మెట్ పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మండలాల ప్రజలకునిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరగడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి చర్యలు తీసుకుంటున్నామని సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రౌడీ షీటర్లు, ఆటంకం కలిగించే వారితో పాటు డీ జె నిర్వాహకులను తహశీల్దార్ ల ఎదుట బైండో వర్ చేయడం జరిగిందని తెలిపారు మెట్ పల్లి లో 96మందిని, మల్లాపూర్ లో 42మంది, ఇబ్రహీంపట్నం లో 37మందిని బైండో వేర్ చేశామని అన్నారు.. కొత్తగా ఎవరైనా నిమజ్జనం రోజున అల్లర్లు చేసి ఆటంకం కలిగిస్తే వారిపై కూడా రౌడీ షీటరుల్లు తెరుస్తామని అన్నారు. రౌడీ షీట్ల తో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి. నిమజ్జనం మధ్యాహ్నం 12గంటల నుంచి మొదలు పెట్టి రాత్రి 11గంటల లోపు ముగించాలి. డీ జె నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ సౌండ్ బాక్సలు ఇవ్వవద్దు. ఒకవేళ ఇస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు వారిపై కేసులు పెడతాం. అలాగే మద్యం షాపులు మూసివేయాలి. నిబంధనలు ఉల్లంగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో కూడా ఎక్కడైనా మద్యం అమ్మితే తీవ్ర మైన చర్యలు ఉంటాయి.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరగడానికి అందరూ పోలీసులకు సహకరించాలని మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినట్లయితే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని అన్నారు.

# సీనియర్ జర్నలిస్టు అంజాగౌడ్ సేవలు మరువలేనివి





**– 6వ వర్ధంతి సందర్భంగా అన్నదానం,పండ్ల పంపిణీ..**

**– తండ్రి మార్గంలో జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతున్న తనయుడు కిషోర్ గౌడ్..**

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,సెప్టెంబర్ 14 : సీనియర్ జర్నలిస్టు అంజాగౌడ్ సేవలు మరువలేనివని మాజీ న్యాయమూర్తి భరత్ నగేష్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని మారుతినగర్ లో స్నేహ సొసైటీలో అంజాగౌడ్ 6వ వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.స్నేహ సొసైటీలోని వికలాంగ,మానసిక విద్యార్థులకు బిస్కెట్లు.పండ్లు పంపిణీ చేశారు.అలాగే నగరంలోని వలస కూలీలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ న్యాయమూర్తి భరత్ నగేష్ మాట్లాడుతూ,అంజాగౌడ్ జర్నలిజంలో గ్రామీణ స్థాయి రిపోర్ట్ నుంచి జిల్లా స్థాయి రిపోర్టర్ గా ఎదిగారన్నారు.ఎన్నో అవినీతి,అక్రమాలను వెలికి తీసి తన వంతు సమాజానికి సేవ చేశారన్నారు.పేద ప్రజల సమస్యలను ప్రభుత్వం,అధికారుల దష్టికి



తీసుకువెళ్లడానికి నిత్యం కృషి చేశారన్నారు. తండ్రి బాటలోనే తనయుడు కిషోర్ గౌడ్ జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతున్నారు.ఈ కార్యక్రమంలో మజ్నూర్,యువజన నాయకులు బిలేందర్ సింగ్ విజయ్ కుమార్,నరేందర్ గౌడ్,సాయి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సలహాదారునిగా పదవి బాధ్యతలు చేపట్టిన పోచారం శ్రీనివాస్ రెడ్డి





కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 14

హైదరాబాద్ నాంపల్లిలోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారునిగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ



సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ప్రకాష్ గౌడ్, ఆది శ్రీనివాస్,రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు కాసుల బాలరాజ్, ఈరవత్రి అనిల్, నగర మేయర్ విజయలక్ష్మి, పోచారం శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం శంభూ రెడ్డి, పోచారం కుటుంబ సభ్యులు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శివ పార్వతుల కళ్యాణం



కబురు న్యూ కోరుట్ల: సెప్టెంబర్ 14

వినాయక నవరాత్రుల సందర్బంగా పట్టణం లోని సంకల్ప విఘ్నేశ్వర ఆలయం లో ఆలయ ప్రధాన అర్చకులు దేషముఖ్ ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో మొదటగా పుణ్యాహ వాచానం, కలష స్థాపన చేసి ఉత్సవ మూర్థులకు ఫల పంచామృత అభిషేకాదులు జరిపి శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు అర్చకులు మాట్లాడుతూ ఆది దంపతుల కళ్యాణం జరిపించిన చూసినా కూడా ఫలం దక్కుతుందని నిరాకారుడు అయిన శివ తత్త్వం తెలుసుకోవడం వల్ల సమస్యలు అన్ని దూరమవు తాయని అన్నారు ఈ సందర్బంగా కన్యా దాతలుగా కస్తూరి రమేష్ దంపతులు వ్యవహారించారు. ఈ కార్యక్రమం లో సుదవేణి మహేష్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అతిథి మహిళా అధ్యాపకురాలి కోసం దరఖాస్తుల ఆహ్వానం

కబురు న్యూస్ జగిత్యాల సెప్టెంబర్ 14

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో భౌతిక శాస్త్రం మరియు రసాయన శాస్త్రము లో బోధించుటకు మహిళా అతిథి అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి గునుక శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీ తో పాటు అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అర్హులైనవారిని డెమో ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని, అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 17 మంగళవారం రోజున ఉదయం 10 గంటలకు నేరుగా కళాశాలకు వచ్చి హాజరు కావలసిందిగా పత్రికా ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 8639365500 ను సంప్రదించ గలరని తెలిపారు.

# భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈరోజు వేములవాడ పట్టణంలో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బిజెపి జిల్ల అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ గారి చేతుల మీదుగా ప్రారంభం అయ్యింది ఈ కార్యక్రమంలో మొదలుగా బిజెపి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు కు బిజెపి పార్టీ సభ్యత్వం ఇవ్వడం జరిగింది ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ బిజెపి బిజెపి పార్టీ దేశ ప్రజల మద్దతుతో మూడు పర్యాయాలు అధికారంలో ఉన్న దేశం కోసం దేశ ప్రయోజనాల కోసం , దేశ అభివృద్ధికోసం ,ప్రపంచంలోనే భారత్ ను విశ్వగురువుగా తీర్చిదిద్దడానికి నరేంద్ర మోడి గారు వికసిత్ భారత్ లక్ష్యంగా నిర్విరామంగా కృషి వల్లే ఈరోజు భారత్ ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక అభివృద్ధి దేశంగా ఎదుగింది భారత రాజ్యాంగ విలువలను కట్టుబడి ప్రజా స్వామ్య పాలన కేవలం బిజెపి తోనే సాధ్యం భారత అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళుతున్న నరేంద్ర మోడి గారి నాయకత్వాన్ని బలపరుస్తూ జాతీయ వాద భావజాలంతో దేశ రక్షణ అభివృద్ధిని కాంక్షించే బిజెపి పార్టీకి మద్దతుగా బిజెపి పార్టీలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది

# రైతులకు సోలార్ పంపుసెట్లు : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ధర్మారం : కబురు న్యూస్





ప్రభుత్వం ఖర్చుతో రైతులకు సోలార్ పంపు సేట్లను అందించబోతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో తెలంగాణా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు పర్యటించారు. మొదటగా హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా మండలంలోని నందిమేడారం శివారులోని నవయుగా ప్రయివేట్ లిమిటెడ్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు.ఆ తర్వాత నంది మేడారంతోపాటు కటికెనపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు. అనంతరం ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు.ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లో భూములు కోల్పోయిన, వెల్గటూర్ మండలం చెగ్యం గ్రామనికి చెందిన 125 కుటుంబాలకు 18 కోట్ల నష్టపరిహారాన్ని చెక్కు రూపంలో అందజేశారు.చివరగా ధర్మారం, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి హెూదాలో తొలిసారి ధర్మపురి నియోజకవవర్గానికి వచ్చిన భట్టి విక్రమార్కకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు కాంగ్రేస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ: రైతులకు సోలార్ పంపుసెట్లు ప్రభుత్వం ఖర్చుతోనే ఏర్పాటు చేస్తామని అన్నారు.2029-30 వరకు రాష్ట్రంలో 20వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ను ఉత్పత్తి చేస్తామని విద్యుత్ విషయంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తాం అని అన్నారు.గత పాలకుల లాగా రాష్ట్ర సంపదను దోపిడీ చేసేందుకు సిద్ధంగా లేమని ప్రజల ఆకాంక్షలను చట్టాలుగా మార్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదు అన్న వాళ్లకు చంప దెబ్బ కొట్టేలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ ను రాష్ట్రంలో సరఫరా చేస్తున్నాం అని గుర్తుకు చేశారు.సోలార్ పవర్ ద్వారా రాష్ట్రంలోని రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలకు ఆదాయం సమకూరే లా చర్యలు చేపట్టాం అని పది సంవత్సరాలలో లక్ష రూపాయల రుణమాఫీ చేయలేని బిఆర్ఎస్ నేతలు రుణమాఫీ పై మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని రెండు లక్షల రుణమాఫీ విషయంలో ఒక్క అడుగు కూడా వెనక్కు వేయమని రైతు రుణమాఫీ మాత్రమే కాదు రైతు బీమా, పంటల బీమాకు అయ్యే ఖర్చును కూడా రాష్ట్ర ప్రభుత్వమే రైతుల పక్షాన భరిస్తుందని అన్నారు.సాగునీటి ప్రాజెక్టులు చేపట్టినచోట భూ నిర్వాసితులకు అత్యంత ప్రాధాన్యమిచ్చి నిధులు మంజూరు చేస్తున్నాం అని వారిని త్యాగదనులుగా భావిస్తున్నాం అని అన్నారు.ఉప ముఖ్యమంత్రి వెంట ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎంపీ గడ్డ వంశీకృష్ణ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాగూర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విమోచన దినోత్సవం జరపడం అంటే ప్రభుత్వాలకు ఎందుకు భయం

కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

విమోచన దినోత్సవం జరపడం అంటే ప్రభుత్వాలకు ఎందుకు భయం...తెలంగాణ విమోచన దినోత్సవాలపై అధికారంలో ఎవరున్నా ఎందుకు భయపడడం అలవాటు చేసుకున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదలు.. ఇప్పటి వరకు అదే ఆనవాయితీ సాగుతోంది. తెలంగాణ విమోచన ఉద్యమం లేదా రైతాంగ ఉద్యమం అన్నది ముష్కర మూకలను చెండాడిన చారిత్రక సన్నివేశం. ఆ సమయంలో కమ్యూనిస్టులు పోరాటం మరువ లేనిది. తొమ్మిదనరేళ్లు పాలించిన కెసిఆర్ ఈ ఉద్యమాన్ని చిన్నచూపు చూసి, తెలంగాణ ప్రజలను అవమాన పరిచారు. అలాగే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే దారిలో నడుస్తోంది. తెలంగాణ విమోచన ఉద్యమాన్ని అధికారిక నిర్వహించాలని కమ్యూనిస్టులు డిమాండ్ చేస్తున్నా..ప్రజాపాలన దినోత్సవం పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కప్పదాటు వ్యవహారం ప్రదర్శిస్తోంది. తెలంగాణలో రక్తపుటేరులు పారించిన నవాబులకు గులాములుగా పాలకులు వ్యవసహరిస్తున్నారు. ప్రజల ప్రాణత్యాగాలను చిన్నచూపు చూస్తున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. విమోచనోత్సవం జరుపుకోవడం అంటు రజాకార్ల దాష్టీకాలను ఎండగట్టడం మాత్రమే. ఆనాటి అరాచాకాలను గుర్తు చేసుకోవడం. ఆనాటి దాష్టీకాల్లో ప్రాణాలర్పించిన ప్రజలకు నివాళి అర్పించడం. ఎందరో అమాయక స్త్రీలు తమ మానప్రాణాలు కోల్పోయి బలిదానం అయ్యారు. వారిని స్మరించుకుని వారికి నివాళి అర్పించడం మాత్రమే. నిజాం లొంగిపోయిన రోజు అనడం కంటే ఓ నిరంకుశుడిని పారదోలిన కారణంగా హైదరాబాద్ విమోచన జరిగిన శుభతరుణంగా పరిగణించడంలో తప్పులేదు. ప్రపంచ చరిత్రలో పోరాటాలన్నీ నిరంకుశుల మీద దాడుల కోసం జరిగినవే. వాటిని స్వాతంత్ర్య దినాలుగానే జరుపుకుంటున్నారు. రష్యా ఉద్యమం కావచ్చు..ఫ్రెంచ్ విప్లవం కావచ్చు...చైనా స్వాతంత్ర్యం కావచ్చు..భారత స్వాతంత్ర్య సంగ్రామం కావచ్చు..అన్నీ ఈ కోవలోకి వచ్చేవే. విమోచన జరిపితే ముస్లింలకు కోపం వస్తుందనో..వారి ఓట్లు పోతాయనో కుంచిత ఆలోచనలు చేసే పాలకుల ఉన్నందుకు సిగ్గుపడాలి. తెలంగాణ విముక్తం కూడా ఒక స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదిదే. క్రూర రాచరిక తరహా పాలన నుంచి విముక్తి జరిగిన రోజుగా గుర్తించాలి. నిజాం నిరంకుశాలను, రజాకార్ల ఆగడాలను ఎదరించడానికి జరిగిన రైతాంగ పోరాటం ముమ్మాటికి తిరుగబాటుచరిత్రే అవుతుంది. చైనా, రష్యాల్లో జరిగిన పోరాటలకు ఇది తక్కువేం కాదు. అయినంత మాత్రాన విమోచన దినోత్సవం జరపరాదని అన్నవాళ్లు మూర్ఖులు కాక మరోటి కాదు. దీనిని విస్మరించేలా చేయడం పాలకులకు మంచిది కాదు. ఖాసింరజ్వీ ఘాతుకాలకు అంతులేని చరిత్ర ఉంది. అదంతా చదువుతుంటే రక్తం మరిగిపోతుంది. నిజాం గురించి, ఆ పాలన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విముక్త తెలంగాణ జరిగిన సెప్టెంబర్17న విమోచన ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆకాంక్షలను గత ప్రభుత్వాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కూడా విస్మరించడం ద్వారా చరిత్రను అపహాస్యం చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత దీనిని ఘనంగా జరపాల్సిన ప్రభుత్వం దానిని దాటవేయడం ద్వారా ప్రజలను అవమానించింది. దీనిపై తెలంగాణ ఉద్యమ సమయంలో మాట్లాడిన నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడం మరింత అవమానకరం. తెలంగాణలో రజాకార్లు చేసిన ఘాతుకం రక్తచరిత్రకు తార్కాణం. వారి దాష్టీకానికి ప్రజల మాన,ధన, ప్రాణాలు పోయాయి. అన్నింటికి మించి ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలు ఆడించారు. ఇక అత్యాచార ఘటనలకు అంతేలేదు. భర్తల ముందే మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగబడ్డారు. అడ్డొచ్చిన మహిళల భర్తలను అడ్డంగా తెగనరికారు. గతంలోకి వెళితే... ఆఖరి నిజాంకాలంలో, క్రూరభూస్వామ్యం పడగలెత్తి గ్రామాలను పీడించుకుని తింటున్న ప్పుడు, ప్రజలు తిరగబడ్డారు. పోరాడారు. భూములు ఆక్రమించుకుని పంచు కున్నారు, మరోవైపు నిజాంను కీలుబొమ్మ చేసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపైన, కొన్ని చోట్ల కాంగ్రెస్ వారిపై, ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడ ఉంటే అక్కడ దౌర్జన్యాలు చేశారు. భూస్వాముల గడీల్లో ఆశ్రయం పొందుతూ వారి తరఫున దాడులు చేశారు. పెద్ద ఎత్తున రక్తపాతం జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా బైరాన్‌పల్లి, పరకాల ఇలా ఎన్నోచోట్ల అరాచ కాలకు అడ్డూ అదుపులేకుండ ఆపోయింది. కేవలం జలియన్ వాలా బాగ్ గురించి మాత్రమే చెప్పుకుంటాం. అంతకు మించి పరకాలలో నరమేథం సాగింది.బైరాన్‌పల్లిలో ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలను ఆడించారు. పొలాలపై దాడులు చేశారు. ధాన్యాన్ని తరలించారు. క్రూరంగా హింసించారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతటి దారుణాలు జరిగినా స్వాతంత్ర్య పోరాటం కారణంగా ఇవన్నీ మరుగున పడిపోయాయి. మరోవైపు నిజాం, భారత, పాకిస్థాన్ దేశాలు రెంటితోనూ తాను కలవబోనని, స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. ఓ దశలో పాక్‌లో కలవడాని కి కూడా సిద్ధం అని ప్రకటించాడు. భారత ప్రభుత్వంతో ఆ విషయమై చర్చలు, వాదాలు సాగుతూ ఉండగానే, మరో వైపు కమ్యూనిస్టుల పోరాటం సాగుతూ ఉన్న దశలోనే, భారత ప్రభుత్వం సైనికచర్య జరిపింది. నిజాం లొంగి పోయాడు. నిజాం లొంగడానికి అంతా సాజావుగా సాగలేదు. ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య తీసుకుని ఉండకపోతే హైదారాబాద్ సంస్థానం చరిత్ర మరోలా ఉండేది. అన్ని సంస్థానాలను విలీనం చేసిన సందర్భంగా ఎలాంటి పేచీ రాకున్నా కాశ్మీర్ విషయంలో మొన్నటి దాకా పంచాయితీ తేలలేదు. 370 రద్దుతో మొన్నటికి మొన్న అది సంపూర్ణంగా భారత్‌లో విలీనం అయ్యింది. తెలంగాణ విషయంలో కూడా నెహ్రూ జోక్యం ఉండివుంటే కాశ్మీర్ లాంటి పరిస్థితి మనకు ఉండేది. అయితే తెలంగాణలో రజాకార్ల పాలనలో జరుగుతున్న అరాచాకాలను కమ్యూనిస్టులు, రైతులు, మహిళలు ఎదరించి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. నిరంకుశ రాచరిక తరహా పాలన స్థానంలో ప్రజాప్రాతినిధ్య పాలన కోసం జరిగిన పోరాటం అంతా ఇంతాకాదు. తెలంగాణ అంతర్భాగంగా ఉన్న హైదరాబాద్ రాజ్యంలో జరిగింది జాతీయోద్యమం కాకున్నా అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సాయుధ పోరాటం చేయాల్సి వచ్చింది. గాంధీతో సహా కాంగ్రెస్ వారు ఆనాడు ఇక్కడి ప్రజల గురించి పట్టించు కోలేదు. ఇక కమ్యూనిస్టులు చేసింది భూస్వామ్యానికి వ్యతిరేకంగా భూమికోసం విముక్తి పోరాటం మాత్రమే. అయితే రజాకార్ల దాష్టీకానికి ప్రజలు సమాయత్తం అయినప్పుడు అంతా కలసి కదిలారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి వీరులు చేసిన త్యాగం తక్కువేం కాదు. 1948 సెప్టెంబర్ 13-17 మధ్య భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంపై జరిపిన పోలీసు చర్య కారణంగా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యింది.ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించడంతో పాటు,ప్రజలు కూడా సంతోషించి సంబరాలు చేసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి జరిగిన విముక్తి పోరాటం కావడం తో ప్రజల్లో సహజంగానే ఆనందం వెల్లి విరిసింది. బానిస సంకెళ్లు తెగినందుకు ఆనందిం చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరవాత విమోచనోత్సవాన్ని పక్కన పెట్టిన కెసిఆర్ చరిత్రహీనుడిగా మిగిలారు.రెండే ళ్ల క్రితం కేంద్రం విమోచన దినోత్సవం అధికారికంగా జరపాలని నిర్ణయించి.. ఉత్సవాలను జరిపింది. దీనిని విమోచన దినంగా, స్వాతంత్ర్య దినంగా జరపాలని అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆనాటి కాంగ్రెస్ నేత, నేటి డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ వేదికగా దీనిని ప్రస్తావించడం గుర్తు చేసుకోవాలి. కానీ నేడు ఎందుకనో వారే ఇప్పుడు తెలంగాణ విమోచన ఉద్యమాన్ని కాదన ప్రజాపాలన అంటూ ఉత్సవం నిర్వహించాలనుకోవడం సిగ్గుచేటు.

# దశాబద్దాల తరవాత దోడాకు ప్రధాని

కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

### ఎన్నికల ప్రచారం కోసం కదిలిన మోడీ
### దోడాలో ఎన్నికల సభతో రికార్డు

ప్రధానిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి వినూత్న నిర్ణయాలతో దూసుకు పోతున్న ప్రధాని నరేంద్రమోదీ మరో సంచలనానికి తెరతీసారు. ఎర్రకోటపై బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్ ప్రొటెక్షన్ లేకుండానే గత 11 ఏళ్లుగా ప్రసంగిస్తూ వస్తున్న మోదీ.. ఇప్పుడు జమ్ము కశ్మీర్‌లో అత్యంత సున్నిత ప్రాంతమైన దోడా జిల్లా ఎన్నికల ర్యాలీలో శనివారం పాల్గొన్నారు. కాశ్మీర్‌లో పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికలకు అన్ని పార్టీలు తమ పూర్తి బలాన్ని ఇచ్చాయి. బీజేపీ కూడా మిషన్ 50లో నిమగ్నమై ఉంది. ఈ లోయ ప్రాంతంలో కమలం వికసించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తర్వాత ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్ నుంచి ఎన్నికల సందడి చేస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు దోడాలో జరిగిన ర్యాలీలో ప్రధాని మోదీ ప్రసంగించి చరిత్ర సృష్టించారు. నాలుగు దశాబ్దాల తర్వాత అంటే 45 ఏళ్ల తర్వాత ఓ ప్రధానమంత్రికి ఇదే తొలి ర్యాలీ కావడం విశేషం. 1979లో ఇందిరా గాంధీ దోడాలో ర్యాలీ నిర్వహించారు. దోడా అనేక దశాబ్దాలుగా తీవ్రవాదంతో ప్రభావితమైంది. ర్యాలీకి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ర్యాలీ జరిగే ప్రదేశాన్ని డ్రోన్లతో పర్యవేక్షించారు. దీని కోసం మొత్తం కాంప్లెక్స్‌ను సీల్ చేశారు. పరిసర ప్రాంతాల్లో భద్రతను కూడా కట్టుదిట్టం చేశారు. దోడాలో ప్రధాని ర్యాలీ చీనాబ్ ప్రాంతంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. దోడా చీనాబ్ ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది. చీనాబ్ ప్రాంతంలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అవి దోడా, దోడా వెస్ట్, భదర్వా, కిష్త్వార్, ఇంద్రవాల్, పదర్-నాగసేని, రాంబన్, బనిహాల్. బీజేపీ



మిషన్ 50కి అన్ని సీట్లు కీలకం. జమ్మూలోని మొత్తం 43 స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తోంది. గతంలో 1979లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఇక్కడ సమావేశం నిర్వహించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల మధ్య పక్కనే ఉన్న కిష్త్వార్ జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. చీనాబ్ ప్రాంతంగా పేరొందిన జమ్మూ కశ్మీర్‌లో ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ 13 రోజుల్లో మూడు ఎన్నికల ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలు జమ్మూ కశ్మీర్‌లో మిషన్ 50 గమ్యాన్ని చేరుకోవడానికి బీజేపీ ప్లాన్ చేస్తుంది. ఈ ర్యాలీల ద్వారా బీజేపీ ప్రత్యర్థుల దుష్ప్రచారానికి మోదీ కౌంటర్ ఇచ్చారు. సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1 తేదీల్లో జమ్మూ కశ్మీర్‌లో మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. కేంద్ర పాలిత ప్రాంతంగా అవతరించిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అందువల్ల బీజేపీతో సహా ఇప్పటి వరకు ఇక్కడ అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకమని చెప్పవచ్చు. ప్రధానమంత్రి మోదీ మూడు ర్యాలీలు బీజేపీ తన మిషన్‌ను పూర్తి చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. జమ్మూకశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో పోలింగ్ జరుగుతోంది. మొదటి దశ ఓటింగ్ సెప్టెంబర్ 18న, రెండో, మూడో దశ ఓటింగ్ సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న జరగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు రానున్నాయి. ఆగస్ట్ 31న జమ్మూ కాశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించింది. దీని తర్వాత ప్రధాని మోదీ జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.దోడా తర్వాత ప్రధాని మోదీ హర్యానాకు వెళ్లనున్నారు. మోదీ ఈ బహిరంగ సభతో ఆ రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించనున్నారు. ఆర్టికల్ 370 రద్దు సహా ఇతర అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావం చూపించనుండగా.. దాదాపు పదేళ్ల తర్వాత జమ్ముకశ్మీర్‌కు ఎన్నికలు జరగనుండగా.. అవి మూడు దశల్లో జరగనున్నాయి. జమ్ము మొదటి నుంచి భారతీయ జనతా పార్టీకి స్ట్రాంగ్ హోల్డ్‌గా ఉండగా.. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 25 స్థానాల్లో విజయం సాధించింది. ఆ తర్వాత ఇప్పుడే శాసనసభ ఎన్నికలు జరగనుండగా.. బీజేపీ తమపట్టు నిలుపుకునేందుకు మోదీ బహిరంగసభ ఉపకరిస్తుందని అక్కడి నేతలు ఆశిస్తున్నారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు సహా ఆ రాష్ట్రాకి ప్రత్యేకపతిపత్తి ఎత్తేసిన తర్వాత జరుగుతున్న తొలిసారి జరుగుతున్న ఎన్నికలు కావడంతో దేశం యావత్ ఈ ఎన్నికలను ఆసక్తిగా గమనిస్తోంది. జమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నో మార్పులు చోటుచేసుకోగా..లాల్‌చౌక్‌పై దాదాపు 73 ఏళ్ల తర్వాత భారత జెండా ప్రజల మధ్య ఎగురేయడం చాలా గొప్పవిషయంగా రాజకీయ విశ్లేషకులు చెబుతారు. మోదీ దేశంలో ఎన్నో ప్రాంతాలకు వెళ్లిన మొదటి ప్రధానిగానూ రికార్డు సృష్టించారు. లక్ష దీవులకు వెళ్లి కుర్చీ వేసుకుని తీరంలో కూర్చుంటేనే.. మాల్దీవుల టూరిజం కూసాలు కదిలి పోయాయి. అప్పటి వరకూ చైనా పంచన చేరి భారత్‌ను ఇబ్బంది పెడుతూ వస్తున్న మాల్దీవుల సర్కారు.. దెబ్బకు దెయ్యం వదిలి దారికి వచ్చింది. తొలిసారి ప్రధానిగా ఎన్నికైన తర్వాత 2015లో ఆఫ్ఘనిస్థాన్‌కు వెళ్లిన మోదీ.. కాబూల్ నుంచి ఆకస్మికంగా లాహోర్ వెళ్లడం అప్పట్లో సంచలం సృష్టించింది.

## దేశవ్యాప్తంగా భారీ వర్షాలు
### విస్తరిస్తున్న నైరుతి పవనాలు
### ఉత్తరాదిలో పలుచోట్ల భారీ వర్షాలు



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

దేశంలో నైరుతి రుతుపవనాలు పర్వతాల నుంచి మైదానాల వరకు విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలోనే అనేక చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నేడు, రేపు కూడా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని గంగా తీరాలలో సెప్టెంబర్ 15 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఇది కాకుండా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, సిక్కిం, మహారాష్ట్ర, గుజరాత్ అన్ని ఈశాన్య రాష్ట్రాలలో రాబోయే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు మిజోరాం, త్రిపుర, అసోం, మేఘాలయ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ ప్రాంతాల్లో సెప్టెంబరు 14, 15 తేదీల్లో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని కత్రాలోని త్రికూట పర్వతంపై రోజంతా పొగమంచు కారణంగా మా వైష్ణో దేవి వద్దకు హెలికాప్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయినప్పటికీ, బ్యాటరీ కార్, రోప్‌వే సేవలు కొనసాగించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి సుమారు 18 వేల మంది భక్తులు అమ్మవారిని కొలుస్తూ భవనం వైపు బయలుదేరారు. జ్యోతిర్మఠం-మలారి రహదారిని మూసివేయడంతో 47 మంది వ్యక్తులు మార్గమధ్యంలో చిక్కుకుపోయారు. పార్థదీప్‌లో కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ హైవే శుక్రవారం రోజంతా మూసివేయబడింది. సిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో శనివారం వరదలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సిమ్లా హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే పశ్చిమ హిమాలయ రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారులతో సహా 400కి పైగా రహదారులపై ట్రాఫిక్ నిలిచిపోయింది. బద్రీనాథ్ హైవే కూడా రోజంతా మూసివేయబడింది. కేదార్‌నాథ్ ఫుట్‌పాత్ రెండో రోజు కూడా తెరవలేదు. హిమాచల్‌లోని రెండు జిల్లాల్లో ఆకస్మిక వరదల ప్రమాదం పెరిగింది. అదే సమయంలో మైదాన రాష్ట్రాల్లో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు జలమయమై జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. ఉత్తరాఖండ్‌లోని కుమావోన్ ప్రాంతంలో వర్షాల కారణంగా పలు ఘటనల్లో ముగ్గురు మహిళలు సహా ఐదుగురు మరణించారు. ఈ మరణాలు లోహాఘాట్, పితోరాఘర్, అల్మోరా, హల్ద్వానీ, సితార్‌గంజ్‌లలో సంభవించాయి. రాష్ట్రంలోని 324 రహదారులు కూడా పర్వతాల నుంచి రాళ్లు, శిథిలాల కారణంగా వివిధ ప్రాంతాల్లో మూసుకు పోయాయి. వీటిలో 185 రోడ్లు కుమావోన్ ప్రాంతంలో ఉన్నాయి. పలు జిల్లాల్లో పాఠశాలలు మూతపడ్డాయి. కార్బెట్ పార్క్‌లో సఫారీ కూడా నిలిపివేశారు.

# ముగింపు దశకు వినాయక చవితి ఉత్సవాలు

కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

### గంగ ఒడికి సిద్ధం అవుతున్న గణపయ్య

వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నిమజ్జనంతో ఈ యేడు ఉత్సవాలు ముగుస్తాయి. తొమ్మిది రోజుల పాటు పూజలను అందుకున్న గణపయ్య పదో రోజైన అనంత చతుర్దశి రోజున నిమజ్జనంతో గంగమ్మ ఒడిలోకి చేరతాడు. అనంత చతుర్దశి రోజున ప్రజలు గణపతి విగ్రహాన్ని ఎంతో వైభవంగా, సంగీత వాయిద్యాలతో ఊరేగిస్తూ నది దగ్గరకు తీసుకుని వెళ్లి నిమజ్జనం చేస్తారు. అనంతచతుర్దశి కూడా మనకు ఎంతో ప్రముఖమైన రోజు. ఈ రోజున అనంతపద్మనాభ వ్రతం చేస్తారు. ఈ క్రమంలో తెలంగాణలో 17న మంగళవారం నిమజ్జనం జరుగనుంది. గణపతి బప్ప మళ్లీ ఏడాది తమ ఇంటికి తీసుకుని రావాలని ప్రార్థిస్తారు. గణేశ్ ఉత్సవం భాద్రపద మాసంలోని శుక్ల పక్ష చతుర్థి తిథిన ప్రారంభమవుతుంది. ఈ పండుగ భాద్రపద మాసంలోని శుక్ల పక్షం చతుర్దశి తేదీ వరకు కొనసాగు తుంది.ఈ 10 రోజులు వినాయకుడు ఇళ్ళలో, పూజా మండపాలలో కొలువుదీరి పూజలను అందుకుంటాడు. వేద క్యాలెండర్ ప్రకారం అనంత చతుర్దశి తిథి 16 సెప్టెంబర్ మధ్యాహ్నం 03:10 గంటలకు ప్రారంభమవుతుంది. అనంత చతుర్దశి రోజున ఉదయం 6.20 గంటల నుండి 11.44 గంటల వరకు పూజాది కార్యక్రమాలు



నిర్వహిస్తారు. గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి ఉదయం 9.23 నుంచి సాయంత్రం 9.28 వరకు శుభ సమయం. ఈ శుభ సమయంలో గజాననుడి విగ్రహాన్ని నిమజ్జనం చేయడం వల్ల పుణ్యఫలం లభిస్తుందని నమ్మకం.గణేశుడిని నిమజ్జనం చేయడానికి ముందుగా చెక్క ఆసనాన్ని సిద్ధం చేయండి. దానిపై స్వస్తిక్ గుర్తుని వేసి గంగాజలంతో శుద్ధి చేయండి. పసుపు రంగు వస్త్రాన్ని పరచి దానిపై వినాయక విగ్రహాన్ని ఉంచి.. కొత్త బట్టలు వేసి పసుపు, కుంకుమ అంద్దండి. అనంతరం ఆసనంపై అక్షతలు వేసి గణపతి విగ్రహానికి పూలు, పండ్లు, మోదకం మొదలైన వాటిని సమర్పించండి. బప్పా విగ్రహాన్ని నిమజ్జనం చేసే ముందు పూర్తి నియమ నిబంధలనతో పూజించండి. గణపతి తిరిగి తమ ఇంటికి మళ్ళీ తిరిగి రమ్మనమని ప్రార్థించండి. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి హారతి ఇవ్వండి. ఆ తరువాత గణేశ విగ్రహాన్ని ఆచారబద్ధంగా నిమజ్జనం చేయండి. పుజాదికార్యక్రమాల సమయంలో ఏమైనా తెలిసి తెలియక తప్పులు చేస్తే క్షమించమని గణపయ్యను అడగండి. వచ్చే ఏడాది మళ్లీ ఇంటికి రమ్మనమని ప్రార్థించడం ద్వారా ఉత్సవాలు ముగుస్తాయి

# పార్టీ బలోపేతంపై జగన్ దృష్టి

»నలుగురు అధికార ప్రతినిధుల నియామకం
»రోజా, యాంకర్ శ్యామలకు చోటు
»ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి, ఆ తర్వాత కీలక నేతలు పార్టీని వీడుతుండడంతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు.
» ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులకు పార్టీలో కీలక బాధ్యతలను అప్పగించడం చేస్తున్నారు.



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

ఈ క్రమంలో ఇప్పటికే కొన్ని జిల్లాలకు కొత్త అధ్యక్షులను కూడా నియమించారు. నియోజక వర్గాల ఇన్‌ఛార్జీలకూ స్థానచలనం కల్పించారు. తాజాగా పార్టీకి నలుగురు కొత్త అధికార ప్రతినిధులను నియమించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, జూపూడి ప్రభాకర్ రావులను అధికార ప్రతినిధులుగా అపాయింట్ చేశారు. ఇదే జాబితాలో ప్రముఖ యాంకర్ శ్యామలకు కూడా చోటు దక్కడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైసీపీ అధికార ప్రతినిధుల లిస్ట్ విడుదలైంది. అందులో మాజీ మంత్రి రోజా, యాంకర్ శ్యామల కూడా ఉన్నారు. మహిళా కోటాలో వారిద్దరికీ ప్రయారిటీ ఇచ్చారు జగన్. ఇప్పటికే వారికి ఫైర్ బ్రాండ్లు అనే పేరుంది. గత ఎన్నికల సమయంలో రోజా, శ్యామల.. ఇద్దరూ చంద్రబాబు, పవన్‌ని బాగా టార్గెట్ చేశారు. ఇప్పుడు కూడా వారికి అదే పని అప్పజెప్పారు జగన్. అధికార ప్రతినిధులుగా వైసీపీ నలుగురు పేర్లను ప్రకటించింది. భూమన కరుణాకర్ రెడ్డి, జూపూడి ప్రభాకర్, రోజా, శ్యామల ఇందులో ఉన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో కీలక పదవుల్ని భర్తీ చేస్తున్న జగన్, తాజాగా అధికార ప్రతినిధుల విషయంలో వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. పదవులు లేకపోయినా పార్టీ వాయిస్ ని మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్.. వినిపిస్తున్నారు. వీరికి తోడు ఇప్పుడు అధికార ప్రతినిధుల జాబితా విడుదలైంది. ఇటీవల పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న రవిచంద్రారెడ్డి సాక్షి ఛానెల్ లో పార్టీ పెద్దలను విమర్శించి కలకలం రేపారు. సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన టార్గెట్ చేశారు. ఆ తర్వాత ఇతర యూట్యూబ్ ఛానెళ్లలో కూడా అలానే మాట్లాడారు. దీంతో పార్టీ అలర్ట్ అయింది. రవిచంద్రారెడ్డిని దూరం పెట్టింది. మీడియా ఛానెళ్లలో చర్చలకు వెళ్లేవారి లిస్ట్ ని ప్రకటించింది. ఈ జాబితాలో వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులు.. వీరితోపాటు మరో 14 మంది పేర్లు ఉన్నాయి. వీరు మినహా ఇంకెవరూ వైసీపీ తరపున ప్యానెల్ డిస్కషన్స్ లో పాల్గొనకూడదని ఆదేశాలిచ్చారు. తాజాగా పార్టీ తరపున ప్రెస్ మీట్లు పెట్టేందుకు అధికారికంగా ప్రతినిధులను నియమించారు.

# ప్రభుత్వ లక్ష్యం పారదర్శకంగా నష్ట వివరాల నమోదుకు రీవెరిఫికేషన్

## ఈ నెల 15వ తేదీన ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

» ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ముంపునకు గురై నష్టపోయిన బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసి..
»వారిని కష్టాల నుంచి గట్టెక్కించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నష్టాల వివరాలను నమోదు చేయడం జరిగిందని..




కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

అత్యంత పారదర్శకంగా నివేదికలను రూపొందించి ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు ప్రత్యేక బృందాలతో రీవెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. కలెక్టర్ డా. జి.సృజన శనివారం నగరంలోని సింగ్‌నగర్ వాంబే కాలనీ ప్రాంతంలో పర్యటించి నష్ట వివరాల డేటా రీవెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ జిల్లాలో వరద ముంపు నష్టాల నమోదు ప్రక్రియను దాదాపు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఏ కారణంచేతనైనా నష్టాల వివరాలు నమోదుకాని వారికి సంబంధిత సచివాలయాల ద్వారా మరో అవకాశం కల్పించి క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ బృందాలు పరిశీలించిన వివరాలను యాప్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. నష్ట వివరాలను నమోదుచేసి, నష్టపోయిన ప్రతి బాధితునికీ సాయమందించి వారిని కష్టాల నుంచి గట్టెక్కించి ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పారదర్శకంగా నివేదికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ముంపునీటి కారణంగా నష్టపోయిన గ్రౌండ్ లోర్ నివాసితులతో పాటు మొదటి అంతస్తులో ఎలాంటి నష్టం జరిగినా.. అలాంటి వాటి వివరాలను కూడా సేకరించి, నివేదికలో పొందుపరచాలని ఎన్యూమరేషన్ బృందాలకు స్పష్టమైన సూచనలు చేయడం జరిగిందన్నారు. ముంపు కారణంగా దెబ్బతిన్న వాహనాలకు, ఇతర ఆస్తులకు ఇన్సూరెన్స్ పరిహారాన్ని అందించాలన్న లక్ష్యంతో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ సెలవురోజులైన శని,ఆదివారాల్లో కూడా పనిచేసేలా చర్యలు తీసుకున్నామని, ఈ సెంటర్ తర్వాత కూడా యథాతథంగా సేవలందిస్తుందని, బాధితులు ఫెసిలిటేషన్ సెంటర్లో వారికి సంబంధించిన లకెయిమ్‌లను సెటిల్‌చేసుకోవాలన్నారు.

# స్టీల్‌ప్లాంట్‌పై విజయసాయి రాజకీయాలు

## ఘాటుగా విమర్శించిన ఎమ్మెల్యే గంటా



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

ప్రతిదాన్ని రాజకీయం చేయడం రాజ్యసభ సభ్యులు విజయసారెడ్డికి అలవాటుగా మారిపోయిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. సింహాచలం వరాహ నరసింహస్వామిని గంటా శ్రీనివాసరావు శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో రాజ్యసభ సభ్యులు విజయసారెడ్డి చేసిన ట్వీట్‌పై ఎమ్మెల్యే స్పందించారు. విజయసాయిరెడ్డి పరిస్థితి దురదృష్టకరంగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో తాను స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. స్పీకర్ ఆమోదించడం కూడా జరిగిందన్నారు. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ పార్టీ ఎంపీగా ఉన్న విజయ్ సాయి రెడ్డి రాజీనామా చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ఎ లాంట్‌పై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామిని రప్పించి... స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని స్పష్టం చేశారని తెలిపారు.



# జిఎస్టీపై హోటల్ యజమాని వ్యాఖ్యలు



»శ్రీనివాసన్ క్షమాపణల వీడియో వైరల్‌బిజెపి తీరుపై మండిపడుతున్న రాజకీయ నేతలు
»నిర్మలా సీతారామన్ తీరుపై మండిపడ్డ స్టాలిన్
»బెదరించి క్షమాపణలు చెప్పించారన్న రాహుల్
»హోటల్ యజమానులకు క్షమాపణలు చెప్పిన అన్నామలై

కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

తమిళనాడుకు చెందిన అన్నపూర్ణ హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసన్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు క్షమాపణలు చెప్పిన వీడియోపై ప్రస్తుతం రాజకీయ దుమారం రేపుతోంది. కాంగ్రెస్‌తో పాటు తమిళనాడుకు చెందిన ఇండియా కూటమి భాగస్వామ్య పక్షం డీఎంకే సైతం ఈ వీడియోపై బీజేపీని టార్గెట్ చేశాయి. నిర్మలా సీతారామన్ భయపెట్టి క్షమాపణలు చెప్పించుకున్నా రంటూ కాంగ్రెస్ ఆరోపిస్తోంది. తమిళనాడు సీఎం స్టాలిన్ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమిళనాడుకు చెందిన 'శ్రీ అన్నపూర్ణ రెస్టారంట్' యజమాని శ్రీనివాసన్ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు క్షమాపణలు చెప్పడంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ స్పందించారు. హోటల్ ఓనర్‌తో క్షమాపణలు చెప్పించడం సిగ్గు చేటని అన్నారు. ఓ సమావేశంలో జీఎస్టీపై మాట్లాడినందుకే అతడితో బలవంతంగా నిర్మలా సీతారామన్‌కు క్షమాపణలు చెప్పించారని మండిపడ్డారు. ఇది ఎంతో నిరుత్సాహకరమైన చర్య. కేంద్ర మంత్రి స్థాయిలోని వారు అలా చేయడం సిగ్గు చేటు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చర్యలను ప్రజలు చూస్తూనే ఉన్నారని స్టాలిన్ పేర్కొన్నారు. ఓ హోటల్ యజమానితో క్షమాపణలు చెప్పించుకోవడం సిగ్గుచేటంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరోవైపు బీజేపీ సైతం కాంగ్రెస్, డీఎంకేకు కౌంటర్ ఇస్తోంది. శ్రీనివాసన్ స్వచ్ఛందంగా తనకు తానుగా క్షమాపణలు చెప్పారని.. దీనివెనుక ఎలాంటి ఒత్తిడి లేదని బీజేపీ నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం తమిళనాడుతో పాటు దేశ వ్యాప్తంగా నిర్మలా సీతారమన్‌కు హోటల్ యజమాని క్షమాపణలు చెప్పిన వీడియో వైరల్ అవుతోంది. ఇదిలావుంటే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన కోవైలో సెప్టెంబర్ 12న జీఎస్టీపై సందేహాల నివృత్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. అన్నపూర్ణ హోటల్స్ యజమాని శ్రీనివాసన్ ఈ సమావేశంలో కొన్ని రకాల తినుబండారాలపై విధిస్తున్న జీఎస్టీపై తన అభ్యంతరాలను ఆర్థిక మంత్రికి తెలియజేశారు. స్వీట్స్‌పై 5 శాతం జీఎస్టీ విధిస్తుండగా.. నమ్‌కీన్స్ (హాట్)పై 12 శాతం జీఎస్టీ సబబు కాదన్నారు. అలాగే బన్నుకు జీఎస్టీ లేకపోయినా క్రీమ్ బన్నుకు 18శాతం జీఎస్టీ విధిస్తుండటంతో కొనుగోలుదారులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నామని.. రకరకాల జీఎస్టీలతో ఒకోసారి బిల్లు వేసే కంప్యూటర్ తికమక పడుతోందని సరదాగా వ్యాఖ్యానించారు. ఆయన ప్రశ్నలకు నిర్మలా సీతారమన్ సమాధానం చెప్పారు. అయితే ఈ వీడియో సోషల్ మీడియాతో వైరల్ అయింది. సమావేశం ముగిసిన తర్వాత శ్రీనివాసన్ నిర్మలా సీతారమన్‌ను కలిసి క్షమాపణలు చెప్పారు. ఓ గదిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ ఉండగా అన్నపూర్ణ హోటల్స్ ఎండీ శ్రీనివాసన్ ఉన్నారు. శ్రీనివాసన్ క్షమాపణలు చెబుతున్న వీడియోను తమిళనాడు బీజేపీ కన్వీనర్ బాలాజీ ఎంఎస్ షేర్ చేశారు. అసభ్యకర మైన ప్రసంగానికి శ్రీనివాసన్ క్షమాపణలు చెప్పారన్న వ్యాఖ్యాన్ని వీడియోతో షేర్ చేశారు. దీనిపై కాంగ్రెస్, డీఎంకే సహా విపక్షాలు బీజేపీని టార్గెట్ చేశాయి. శ్రీనివాసన్‌ను బెదిరించి క్షమాపణలు చెప్పించుకున్నారని ఆరోపించారు. ఓ వ్యక్తి పట్ల బీజేపీ అగౌరవంగా వ్యవహరించిందని, ఆ పార్టీ అహంకారానికి ఇది నిదర్శమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఓ ప్రయివేట్ సంభాషణకు సంబంధించిన వీడియో బయటకు రావడంపై బీజేపీ తమిళనాడు శాఖ అధ్యక్షులు అన్నామలై ఎక్స్ వేదికగా క్షమాపణలు కోరారు. బిజెపి తమిళనాడు శాఖ తరపున గౌరవనీయులైన హోటల్స్ యజమాని శ్రీనివాసన్‌కు క్షమాపణలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ప్రయివేట్ సంభాషణను మా కార్యకర్తలు సోషల్ మీడియాలో షేర్ చేసినందుకు చింతిస్తున్నట్లు తెలిపారు.

# జగన్ ఐదేళ్ల పాలనే ఏపీకి అతిపెద్ద విపత్తు

**జగన్ ఐదేళ్ల పాలనే ఏపీకి అతిపెద్ద విపత్తు అని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.**



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 14

జగన్ ఐదేళ్ల పాలనే ఏపీకి అతిపెద్ద విపత్తు అని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద గత ప్రభుత్వం రూపాయి కూడా చెల్లించలేదన్నారు. 2020 ఖరీఫ్ నుంచి రైతులకు పంట బీమా కూడా ఇవ్వలేదని చెప్పారు. వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని తెలిపారు. అర్థం లేని విమర్శలతో వైకాపా కాలక్షేపం చేస్తోందని మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న వరద బాధితులను ఆదుకోవాలన్న ఆలోచనే జగన్‌కు లేదన్నారు. ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించిన దాఖలాలు లేవని చెప్పారు. ఎక్కడ కష్టమొచ్చినా జనసేన సైనికులు ముందుంటున్నారని నాదెండ్ల మనోహర్ తెలిపారు. "ప్రభుత్వ సహాయ కార్యక్రమాల్లో మీరూ భాగస్వాములు కావచ్చు. నాయకుడు ఎలా ఉండాలో పవన్‌ను చూసి నేర్చుకోండి. ప్రతి పంచాయతీకి రూ.లక్ష చొప్పున విరాళమిచ్చారు. తెలుగు రాష్ట్రాలకు రూ.కోటి చొప్పున సాయం చేశారు. ఈ వయసులో సీఎం చంద్రబాబు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. గండ్లు పూడ్చి వాటర్ సీపేజ్ లేకుండా పనులు జరుగుతున్నాయి. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం" అని నాదెండ్ల మనోహర్ చెప్పారు.

# దేవర ప్రమోషన్స్ జోరు

## సందీప్ వంగాతో టీమ్ చిట్‌చాట్




కబురు సినిమా సెప్టెంబర్ 14..

కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన సినిమా 'దేవర' ప్రమోషన్లు జోరుగా సాగుతున్నాయి. భారీ అంచనాల మధ్య ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మూవీ టీమ్ ప్రచారం జోరు పెంచింది. 'యానిమల్' దర్శకుడు సందీప్ వంగాతో 'దేవర' టీమ్ చిట్‌చాట్ నిర్వహించింది. దానికి సంబంధించిన లేటెస్ట్ ప్రోమో తాజాగా విడుదలైంది. 35రోజులు అండర్ వాటర్ సీక్వెన్స్ చేసినట్లు ఎన్టీఆర్ చెప్పగా.. 'దేవర' అందరి కెరీర్‌లో బెస్ట్ మూవీ అవుతుందని జాన్వీ అన్నారు. ఈ సినిమా రన్ టైమ్ పై సందీప్ సరదాగా కామెంట్ చేశారు. ఇటీవల ముంబైలో ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం 'యానిమల్' దర్శకుడు సందీప్ వంగాతో దేవర' టీమ్ చిట్‌చాట్ నిర్వహించింది. దానికి సంబంధించిన లేటెస్ట్ ప్రోమో తాజాగా విడుదలైంది. సందీప్ అడిగిన ప్రశ్నలకు తారక్ తనదైన శైలిలో జవాబిచ్చారు. ఇదొక యాక్షన్ డ్రామా అని, మాస్ ఎలిమెంట్స్‌లో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగిస్తుందని చెప్పారు తారక్. చాలా సంవత్సరాలుగా తారక్, నేను మంచి స్నేహితులమని శివ కొరటాల తమ బాండింగ్ గురించి చెప్పారు. మీరు సినిమా కథ అంతా చెప్పేయమంటున్నారు అని జాన్వీ సందీప్‌పై పంచ్‌లు విసిరింది. ఈ సినిమా రన్ టైమ్ పై సందీప్ సరదాగా కామెంట్ చేశారు. దానికి తారక్ యానిమల్ రన్ టైమ్ ఎంత అని అడగగా 3 గంటల 24 నిమిషాలని నవ్వుతూ సందీప్ రెడ్డి వంగా చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రోమో వైరల్ అవుతోంది.

# మహిళలపై వేధింపులు ఆగాలంటే పటిష్ఠమైన సంస్థలు రావాలి: శ్రద్ధా శ్రీనాథ్

కబురు సినిమా సెప్టెంబర్ 14..

ఇండస్ట్రీలో మహిళలపై వేధింపులు ఆగాలంటే పటిష్ఠమైన సంస్థలు రావాలని బాలీవుడ్ నటి శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తన సినీ ప్రయాణం గురించి చెప్పారు. అలాగే హేమ కమిటీని ఉద్దేశించి మాట్లాడారు. 'నేను మలయాళ చిత్ర పరిశ్రమలోనూ పనిచేశాను. కానీ, నేనెప్పుడూ వేధింపులు ఎదుర్కోలేదు. సురక్షితంగా ఉన్నాను. పార్టీలకు వెళ్లి ఇంటికి వస్తున్నప్పుడు నా చుట్టూ ఏం జరుగుతుందో గమనించుకుంటూ ఉండేదాన్ని. డ్రైవర్ ఎటు చూస్తున్నాడో ఎప్పుడూ అప్రమత్తతతో వ్యవహరించేదాన్ని. ఎనిమిదేళ్ల వయసు నుంచే అలా జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నా. అందుకే నాకు ఎప్పుడూ పరిశ్రమలో వేధింపులు ఎదురుకాలేదు. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలిని. సినిమా సెట్‌లో మహిళలకు సరైన పారిశుద్ధ్య సౌకర్యాలు ఉండవు. అలాంటి కనీస అవసరాలు కచ్చితంగా ఉండేలా చూడాలి. హేమ కమిటీ రిపోర్ట్ చూసి షాకయ్యాను. సమస్యలను ఎదుర్కొంటున్న మహిళలు వాటిని ఎవరితో చర్చించాలో తెలియక ఆగిపోతున్నారు. పరిశ్రమలో మహిళలపై వేధింపులు ఆగాలంటే పటిష్ఠంగా పనిచేసే సంస్థలు రావాలి' అని శ్రద్ధ అభిప్రాయపడ్డారు.మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జస్టిస్ హేమకమిటీ సిద్ధం చేసిన రిపోర్ట్ గత కొన్ని రోజులుగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి ఇప్పటికే పలువురు నటీనటులు తమ అభిప్రాయాలను బయటపెట్టారు. అన్ని ఇండస్ట్రీల్లోనూ ఇలాంటి ఓ కమిటీని ఏర్పాటుచేయాలని కొందరు నటీనటులు కోరుతున్నారు.



# కౌన్ బనేగా కరోడ్‌పతిలో పవన్ కళ్యాణ్‌పై ప్రశ్న

కబురు సినిమా సెప్టెంబర్ 14..

హీరోగా ఇండస్ట్రీలో చెదరని ముద్ర వేసిన పవన్ రాజకీయాల్లోనూ చరిత్ర సృష్టించారు. తన పార్టీ నుంచి పోటీ చేసిన ప్రతి ఒక్కరూ అత్యధిక మెజారిటీతో విజయం సాధించడంతో.. 21 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాలను సొంతం చేసుకున్నారు. దీంతో పవన్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. ఈ క్రమంలో ప్రఖ్యాత 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోలో పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన ప్రశ్న అడగడం విశేషం. ప్రస్తుతం కౌన్ బనేగా కరోడ్‌పతి' 16వ సీజన్ నడుస్తోంది.



బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ దీనికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన ఎపిసోడ్‌లో బిగ్‌బీ ఓ కంటెస్టెంట్‌ను పవన్‌కు సంబంధించిన ప్రశ్న అడిగారు. '2024 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నటుడు ఎవరు?' అని అడిగారు. కంటెస్టెంట్ ఈ ప్రశ్నకు 'ఆడియన్స్ పోల్' ఆప్షన్ తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆడియన్స్‌లో 50 శాతం మందికి పైగా పవన్ కళ్యాణ్ అని చెప్పారు. దీంతో వారు పవన్ పేరు చెప్పి లాక్ చేశారు. అది సరైన సమాధానం కావడంతో కంటెస్టెంట్ రూ.1.60లక్షలు గెలుచుకొని తర్వాత ప్రశ్నకు వెళ్లారు.



# ముద్దు సీన్లలో నటించడం అంత తేలిక కాదు

## యాద్రా ఇంటిమేట్ సీన్లపై నటి మాళవికా మోహనన్

కబురు సినిమా సెప్టెంబర్ 14..

'మాస్టర్', 'తంగలాన్' వంటి చిత్రాలతో దక్షిణాది వారికి చేరువైన కేరళ బ్యూటీ మాళవికా మోహనన్ బాలీవుడ్ ప్రేక్షకులనూ అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఆమె కథానాయికగా నటించిన హిందీ మూవీ 'యుధ్రా' తో ఆమె బాలీవుడ్‌లోకి తెరంగేట్రం చేస్తున్నారు. ఇందులో ఆమె పలు ఇంటిమేట్, ముద్దు సన్నివేశాల్లో యాక్ట్ చేశారు. దీనిని ఉద్దేశించి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇంటిమేట్ సీన్స్‌లో యాక్ట్ చేయడం అంత సులభం కాదన్నారు. ఇంటిమేట్ సీన్స్ చిత్రీకరించే టప్పుడు ఏ సినిమా సెట్‌లోనైనా ఇంటిమేట్ కో-ఆర్డినేటర్‌ను నియమిస్తున్నారు. నటీనటులు ఇబ్బందిపడకుండా ఆయా సన్నివేశాల్లో ఎలా యాక్ట్ చేయాలో వారు చెబుతుంటారు. అది చాలా మంచి నిర్ణయం. అయితే, మా సెట్‌లో అలాంటి కో-ఆర్డినేటర్స్ ఎవరూ లేరు. 'సాథియా' పాట గురించి చెప్పినప్పుడు సిద్ధాంత్, నేను మొదట కంగారుపడ్డాం. 'దీనిని మనం చేయగలమా' అని సందేహం వ్యక్తంచేశాం. సముద్ర తీరం, అందులోనూ చలి తీవ్రత తట్టుకోలేక.. ఏదో ఒకరకంగా దీనిని పూర్తి చేసేయడం మంచిదని భావించి.. దర్శకుడు చెప్పినవిధంగా చేసేశాం. ఇంటిమేట్, లేదా ముద్దు సన్నివేశాల్లో యాక్ట్ చేయడం అంత సులభం కాదు. నటీనటుల మధ్య మంచి అనుబంధం ఉండాలి. సౌకర్యవంతమైన వాతావరణం ఉండాలని మాళవిక తెలిపారు. యాక్షన్ ఫిల్మ్‌గా 'యుధ్రా' సిద్ధమైంది. శ్రీధర్ రాఘవన్ కథ రాయగా.. రవి ఉద్యావర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా నటించారు. సెప్టెంబర్ 20న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినీప్రియులను ఆకట్టుకున్నాయి. ఇటీవల 'సాథియా' పాట విడుదలైంది. ఈ పాటలో సిద్ధాంత్ - మాళవికపై చిత్రీకరించిన పలు సన్నివేశాలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'యుధ్రా'లో యాక్ట్ చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని మాళవిక పలు సందర్భాల్లో తెలిపారు. హిందీ ప్రేక్షకులు సైతం తనని ఆదరించాలని కోరుకున్నారు.

11 రోజులు ఫుట్‌పాత్‌పై పడుకున్నా..

# కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్న రాజ్‌తరుణ్



కబురు సినిమా సెప్టెంబర్ 14..

'ఉయ్యాల జంపాలా'లో హీరోగా నటించి అందరినీ మెప్పించారు రాజ్ తరుణ్. ఆ సినిమాకు గాను ఉత్తమ నటుడిగా అవార్డును సొంతం చేసుకున్నారు. తాజాగా రాజ్ తరుణ్ తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా సినీ పరిశ్రమకు వచ్చినట్లు తెలిపారు.రాజ్ తరుణ్ తాజా చిత్రం 'భలే ఉన్నాడే'. ఈ సినిమా ప్రచారంలో పాల్గొన్న ఆయన కెరీర్ తొలినాళ్ల గురించి తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి హీరోగా మారడానికి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. 'నన్ను ఎవరైనా గుర్తించి ఇండస్ట్రీకి పిలవాలని ఎంతో కష్టపడ్డాను. నాకు వైజాగ్ తప్ప మరో ఊరు తెలియదు. 52 షార్ట్ ఫిల్మ్‌లు తీసిన తర్వాత రామ్మోహన్ గారు చూసి పిలిచారు. రూ.3000కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా జాయిన్ అవ్వమన్నారు. స్క్రిప్ట్ రాసిన తర్వాత సీన్ గురించి చర్చించేవారు. ప్రతీ సీన్ ఇంకా బాగా రాస్తే బాగుండేది అనిపించేది. అదే చెప్పాను. నేను ఉంటే స్క్రిప్ట్ వర్క్ ముందుకుసాగదని తీసేశారు. దీంతో ఏం చేయాలో అర్థం కాలేదు. సినిమాల్లో పనిచేయాలని బీటెక్ కూడా వదిలేసి వచ్చాను. అద్దె కట్టడానికి కూడా డబ్బులు లేక ఫుట్‌పాత్‌పై పడుకున్నాను. 11 రోజులు అక్కడే ఉన్నాను. ఆ తర్వాత మళ్లీ రామ్మోహన్ గారే పిలిపించారు. నాకప్పుడు 20 ఏళ్లు. ఎలాగైనా ఇండస్ట్రీలో సెటిల్ అవ్వాలనే పట్టుదలతో రైటర్‌గా పనిచేశాను. ఆ తర్వాత హీరోగా అవకాశం వచ్చింది' అని చెప్పారు.ఇప్పటివరకు రాజ్ తరుణ్ 23 సినిమాల్లో నటించారు. తాజాగా 'భలే ఉన్నాడే'తో పలకరించి మెప్పించారు. జె.శివసాయి వర్ధన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా కనిపించారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com